



పలాసలో బోరుబావి వద్ద అరకొరగా వచ్చే నీటి కోసం ఉంచిన బిందెలు



ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పురుషోత్తపురంలో ట్యాంకర్ వద్ద మహిళలు మంచినీటి కోసం పడుతున్న పాట్లు ఇవి. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు పనిచేయడం లేదు. ఇక్కడ కొళాయిలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో నీటి కోసం మహిళలు పడే బాధలు వర్ణనాతీతం. ప్రతిరోజూ ట్యాంకర్ల కోసం వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.

దాహం.. దాహం!

- ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పుర ప్రజలు

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో ఎక్కడ చూసినా తాగునీటి ఇబ్బందులే. దశాబ్దాలుగా ఇవే వెతలు కొనసాగుతున్నా ప్రభుత్వాలు సరైన పరిష్కార మార్గం చూపడం లేదు. జిల్లాలో శ్రీకాకుళం తరువాత ఇచ్ఛాపురం మూడు దశాబ్దాల కిందట మునిసిపాలిటీగా అవతరించింది. ఇక్కడ 23 వార్డులు ఉండగా.. మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి కటకటలాడుతున్నారు. మునిసిపాలిటీలో 15ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో 28 వేల మంది జనాభాకు తగ్గట్టుగా వీటిని వేశారు. కానీ ఇప్పుడు పట్టణంతో పాటు జనాభా పెరిగింది. కానీ జనాల అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా లేకుండా పోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 36వేల మంది జనాభా అని చెబుతున్నా.. ఆ సంఖ్య 50 వేలకుపైగా పెరిగినట్టు తెలుస్తోంది. అందుకు తగ్గట్టు నీటి సరఫరా లేక ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణ జనాభాకు రోజుకు సగటున 5.10 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. 1,2,3 వార్డులకు (ఏఎస్‌పేట, పురుషోత్తపురం) ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పలు ప్రాంతాల్లో భూ మట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతులో ఉన్న కొళాయి నుంచి నీటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో 15బోర్లు పనిచేయడం లేదని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకుమించి బోర్లు మూలకు చేరాయని తెలుస్తోంది. రత్తకన్న పరిధిలో చాలా వీధులకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు.

మూలకు చేరిన ప్రాజెక్టులు

ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా బాహుదా నదిలో ఊటబావులు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాత రాజావారితోటలో రిజర్వాయర్ ద్వారా పట్టణ అవసరాల కోసం 8లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ విడిచి పెడుతున్నారు. ఈ నీరు ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. రూ.54.48కోట్ల కేంద్ర నిధులతో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. అది పూర్తయితే కానీ.. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం లేదు. 1,2,3 వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకులయ్యాయి. ట్రయల్‌రన్ వేసి వదిలేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారు. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5లక్షల లీటర్ల నీటిసామర్థ్యం ఉన్న ట్యాంకర్‌ను నిర్మించి వృథాగా వదిలేశారు. ప్రస్తుతం ట్యాంకర్ శిథిలావస్థకు చేరుకుంది. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంలో ఇచ్ఛాపురం మునిసిపాలిటీకి చోటిచ్చారు. కానీ.. ఇంతవరకూ నీటిని అందించలేదు. దీంతో ప్రజల బాధలు వర్ణనాతీతం. వైసీపీ ఐదేళ్ల కాలంలో పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

దశాబ్దాలుగా ఇదే పరిస్థితి



పేరుకే మునిసిపాలిటీ. కానీ చిన్నపాటి గ్రామం కంటే తక్కువే. తాగునీటి సమస్య దశాబ్దాలుగా ఉంది. ఎన్నో ఏళ్ల కిందట పైపులైన్లు, కుళాయిలు పాడయ్యాయి. ఎప్పుడు నీటి సరఫరా ఉంటుందో? ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలి.

\- దుర్యోధనరెడ్డి, ఇచ్ఛాపురం

సౌకర్యాలు లేవు



జిల్లా కేంద్రం తరువాత ఏర్పడిన మునిసిపాలిటీ ఇది. కానీ ఆ స్థాయిలో మాత్రం మౌలిక వసతులు లేవు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంలో ప్రభుత్వాలు విఫలయమయ్యాయి. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించాలి.

\- బొండాడ మహేష్, ఏఎస్‌పేట, ఇచ్ఛాపురం

ఇబ్బంది లేకుండా..

మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడి నిజమే. ప్రజలకు ఇబ్బందులు లేకుండా.. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంతోపాటు కేంద్ర నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. అంతవరకూ ఇబ్బందులు తప్పవు.

\-ఎన్.రమేష్, మునిసిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

మూడు నెలలుగా.. కొళాయి బంద్

- పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో వర్షాలు కురుస్తున్నా.. నీటికి ఇక్కట్లు

(పలాస)

వర్షాలు విస్తారంగా కురుస్తున్నా.. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో అనేక ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పబ్లిక్ కొళాయిల ద్వారా మూడు నెలలుగా చుక్కనీరు కూడా ఇవ్వడం లేదనే ఆందోళన చెందుతున్నారు. శాశ్వత మంచినీటి పథకాలు ఏవీ లేకపోవడంతో.. నిత్యం వేసవిలో మాదిరి వర్షాకాలంలోనూ తమకు నీటి కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 31 వార్డుల్లో సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. జిల్లా కేంద్రం తర్వాత ఈ మునిసిపాలిటీకి పుష్కల ఆదాయం ఉన్నా.. సమగ్ర, శాశ్వత మంచినీటి పథకాలు లేకపోవడంతో నిత్యం నీటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక్కడ కొన్నివార్డుల్లో వెయ్యి అడుగుల మేరకు బోర్లు వేసినా చుక్క నీరుకూడా రాని పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు మునిసిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న హడ్కోకాలనీ, రామలక్ష్మణకాలనీ, రాజమ్మకాలనీ, సూదికొండకాలనీలకు నిత్యం నీటి సమస్యలు తప్పవు. పబ్లిక్ కొళాయిలే వీరికి ప్రధాన నీటి వనరు. అయితే అధికారుల నిర్లక్ష్యం, ముందుచూపు లేకపోవడంతో నెలలు కావస్తున్నా నీరు ఇవ్వక పోవడంతో బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. అవి కూడా పది బిందెలు నీరు నింపితే గంటపాటు సమయం ఆగాల్సిన పరిస్థితి ఉంది. ఈ వీధులు కొండల ప్రాంతంలో ఉండడంతో నీటి లభ్యత తక్కువ. నిత్యం ఇక్కడకు ట్యాంకర్లు ద్వారా సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉంది. మునిసిపల్ కుళాయిల ద్వారా నీరు వచ్చినా.. కొద్దిసేపు మాత్రమే. దిగువ ప్రాంతంలో గంటపాటు నీరు వస్తే.. ఇక్కడకు పది నిమిషాలు మాత్రమే నీరు విడుదలవుతుంది. దీనికి తోడు అనేక ప్రాంతాల్లో అక్రమంగా కుళాయిలకు మోటార్లు పెడుతుండడంతో ఉన్న నీరు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వంతుల వారీగా నీటి కోసం కాపలాకాయాల్సిన పరిస్థితి ఉది. అలాగే శాంతినగర్‌కాలనీ, ఇందిరానగర్ ప్రాంతాల్లో కూడా వేసవిలో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉంటుంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సమగ్ర మంచినీటి పథకం అమలులో ఉన్నా.. మున్సిపాలిటీకి చుక్కనీరు రావడం లేదు. ఆఫ్‌షోర్ ఆధారిత మంచి నీటి పథకం మంజూరైన నేపథ్యంలో సమగ్రనీటి పథకా నికి మోకాలడ్డు వేశారు. ఆఫ్‌షోర్ పనులు నిలిచి నేటికి 15 ఏళ్లు కావస్తున్నా.. ఇంకా వాటి ఆధారంగా నీరు ఇస్తామని అధికారులు నివేదికలు ఇవ్వడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మునిసిపాలిటీ మీదుగా వెళ్తున్న సమగ్ర మంచినీటి పైపులైను మార్గంలో కొంతమేరకు మళ్లిస్తే నీటి కష్టాలు తీరుతాయి. గతంలో ఈ ప్రతిపాదన అధికారుల ముందుకు వెళ్లినా వారు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆఫ్‌షోర్ రిజర్వాయరు నీరు కాకుండా సమగ్ర మంచినీటి పథకాన్ని మునిసిపాలిటికి ఇస్తే.. కొంత నీటికరవు తీరుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



పలాస : ఉదయపురం రోడ్డులో కొళాయి ఇలా..

పోలీసు ప్రతిష్ఠను పెంచేలా విధులు

- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 21: 'పోలీసుశాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలి. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాల'ని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ.. పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. సత్ప్రవర్తనతో మెలగాలని స్పష్టం చేశారు. డీఐజీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా.. ఆయన శనివారం జిల్లాలో పర్యటించారు. శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ.. 'క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి కిందిస్థాయి సిబ్బందికి ఆదర్శంగా ఉండాలి. పోలీసుస్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి. బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టాలి. నేరాల నియంత్రణకు బేసిక్ పోలీసింగ్, పెట్రోలింగ్, గస్తీ పకడ్బందీగా అమలు చేయాలి. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలను సవాల్‌గా తీసుకోవాలి. డ్రగ్స్, సైబర్ నేరాల దర్యాప్తులో నైపుణ్యత పెంచుకోవాలి. మహిళలపై వేధింపుల కేసుల్లో దర్యాప్తు సకాలంలో పూర్తిచేసి.. రెండు నెలల్లో చార్జిషీట్ దాఖలు చేయాలి. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల ని యంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. సమర్థవంతంగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని, తప్పుచేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నేరాల తీరు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను డీఐజీకి వివరించారు. 'గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు సరిహద్దు రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే మార్గాలను గుర్తించి చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నిరంతరం ఆకస్మికంగా వేరువేరు చోట్ల డైనమిక్ వాహన తనిఖీలను చేపడుతున్నాం. గంజాయి క్రయవిక్రయాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామ'ని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, బి.రాజశేఖర్, ఎ.బి.ప్రసాద్, ఏఓ సీహెచ్ గోపినాథ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉషాకిరణ్, సీనియర్ ఏపీపీ పి.సుశీల, లీగల్ అడ్వైజర్ ఎం.యామిని రాణి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు

'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సైబర్ నేరగాళ్ల ఆఫర్లకు చాలామంది ఆకర్షితులై.. డబ్బులు మోసపోతున్నారు. అలాగే గంజాయి బారిన పడి చాలామంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారు' అని డీఐజీ గోపినాథ్ జెట్టీ తెలిపారు. శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గంజాయి నివారణ, సైబర్ నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా.. బహుముఖ ప్రణాళికలు రూపొందిచామని వెల్లడించారు. ఒడిశా నుంచి జిల్లా మీదుగా గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళంలో ట్రాఫిక్ క్రమ బద్ధీకరణకు చర్యలు చేపడతామని, రాత్రివేళల్లో గస్తీ పటిష్ఠంగా అమలు చేస్తామని డీఐజీ తెలిపారు.

నాడు-నేడు కార్యక్రమం పేరిట పాఠశాలల రూపురేఖలు మార్చామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నేటికీ చాలా పాఠశాలలు తాటి, కొబ్బరి కమ్మల నీడలో, పూరిపాకలు, రేకుల షెడ్లల్లో కొనసాగుతున్నాయి. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు పడితే వారికి సెలవులు ఇచ్చి ఇంటికి పంపించేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ పాఠశాలలు బాగుపడతాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పాక కింద చదువుతున్న అబలసింగి విద్యార్థులు

- కమ్మలనీడలో అబలసింగి పాఠశాల
- రేకుల షెడ్డులో పెదరాజపురం బడి
- వానపడితే విద్యార్థులకు సెలవే
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

నాడు-నేడు అదే పరిస్థితి

(కొత్తూరు)

కొత్తూరు మండలంలోని అబలసింగి, పెదరాజపురం గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో దశాబ్దాలుగా ఆరుబయటే విద్యా బోధన సాగుతోంది. ఎత్తయిన కొండల నడుమ 2012 జూన్‌లో అబలసింగి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గది లేకపోవడంతో ఆరుబయట కొబ్బరి కమ్మలతో పాకను ఏర్పాటు చేశారు. దీని నీడలో చదువులు సాగిస్తున్నారు. వంటశాల కూడా ఆరుబయటే ఉంది. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి కమ్మలు వేసినా.. ఎండ తగులుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

చిన్న వర్షం పడినా నీరు కారిపోతుందని, దీనివల్ల వాన కురిసిన రోజు సెలవు ఇచ్చేస్తారని చెబుతున్నారు. పాఠశాల ప్రారంభమై 12 ఏళ్లు గడుస్తున్నా సొంత భవనం లేదని, దీనిపై ఐటీడీఏ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్ని వినతిపత్రాలు అందిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం తమ పాఠశాలను గాలికి వదిలేసిందని, నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేయలేదని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలకు సొంత భవనం మంజూరు చేయాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

- పెదరాజపురం ప్రాథమిక పాఠశాలలో కూడా కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఈ పాఠశాలకు ఇప్పటికీ సొంత భవనం లేదు. రేకుల షెడ్డులోనే విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట తుఫాన్ ధాటికి కొన్ని రేకులు ఎగిరిపోగా, మరికొన్ని దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఆరుబయటే 21 మంది విద్యార్థులకు సీఆర్‌టీ చదువు చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి తరగతి గదులు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.



తుఫాన్ గాలులకు ఎగిరిపోయిన పెదరాజపురం పాఠశాల రేకులు(ఫైల్)

విద్యార్థులకు ఇక్కట్లు



మా గ్రామంలోని పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదు. కూటమి నాయకులు స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

\- సవర మహేష్, పెదరాజపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఏజెన్సీ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తా. సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా.

\- భామిడి రాజు, సామాజికవేత్త, టీడీపీ నాయకుడు

ప్రతిపాదనలు పంపించాం



అబలసింగి, పెదరాజపురం ప్రాథమిక పాఠశాలల భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతాం.

\- చందక గోవిందరావు, ఎంఈవో, కొత్తూరు

దుర్భర పరిస్థితిలోనూ సంక్షేమ బాట

- అభివృద్ధి దిశగా కూటమి పాలన
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- సమస్యల పరిష్కారంపై భరోసా

నందిగాం, సెప్టెంబరు 21:

వైసీపీ ఐదేళ్ల పాలనతో రాష్ట్ర పరిస్థితి దుర్భరంగా మారినా.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమబాట పట్టిందని వ్యవసాయ, పశుసంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం నందిగాం మండలం మొండ్రాయివలసలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. 'వైసీపీ పాలనలో అన్ని రంగాలనూ భ్రష్టు పట్టించారు. ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, రైతుబజార్లు, సచివాలయం.. ఇలా అన్నీ జగన్‌రెడ్డి తనఖా పెట్టి రాష్ట్రాన్ని అప్పులుపాలు చేశారు. గత ప్రభుత్వం రూ.45వేల కోట్లతో ఎరువులు, విత్తనాలు కొని.. బిల్లులు చెల్లించలేదు. 2014-19 మధ్య చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2లక్షల కోట్లు బకాయిలు విడుదల చేయలేదు. అస్తవ్యస్తంగా మారిన వ్యవస్థలన్నింటినీ.. ప్రస్తుతం గాడిలో పెడుతున్నాం. వందరోజుల పాలనలో పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు ఏర్పాటు, ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు, ధాన్యం కొనగోలుకు సంబంధించి రూ.1,680కోట్లు బకాయిలు చెల్లింపు, మెగా డీఎస్సీ ప్రకటన.. ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. అర్హులందరికీ పింఛన్లు అందజేస్తాం. అక్టోబరు 5 నుంచి కొత్తమద్యం పాలసీ అమలు చేస్తాం. టెక్కలి నియోజకవర్గంలో రూ.104కోట్లతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నాం. జగన్ హయాంలో చేపట్టిన బోగస్ సర్వే రద్దు చేశాం. రెవెన్యూ సదస్సుల ద్వారా నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. అంతకుముందు ఆరోగ్య శిబిరాన్ని, పోషకాహార ప్రదర్శనను అచ్చెన్న తిలకించారు. కాగా.. గ్రామంలో ఎనిమిది పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని పురట ఉమాపతి మంత్రికి వివరించారు. తక్షణమే కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో భరత్‌నాయక్, డీఎల్‌పీవో ఐవీ రమణ, జనసేన టెక్కలి ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎస్.జానకిరాం, టి.ఉమామహేష్, మదన్‌గౌడ్, బి.గిరి, జె.మోహనరావు, అధికారులు రాజారావు, భాగ్యలక్ష్మి, సంతోష్‌కుమార్, నర్సింహులు, చిన్నారావు పాల్గొన్నారు.





మొండ్రాయివలస సభలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, హాజరైన ప్రజలు

కందిరీగల దాడిలో ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- లంకపేటలో విషాదం

రణస్థలం, సెప్టెంబరు 21: రణస్థలం మండలం రావాడ పంచాయతీ పరిధి లంకపేటలో నలుగురు రైతు కూలీలపై శుక్రవారం సాయంత్రం కందిరీగలు దాడి చేశాయి. దీంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. లంకపేటకు చెందిన కిల్లారి రమణమ్మ, కిల్లారి సూరికృష్ణప్పడు, బొంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు మరి కొంతమంది రైతులు శుక్రవారం పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వారంతా ఇంటికి వస్తుండగా.. గ్రామ సమీపంలో కందిరీగలు వారిపై దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు తొలుత రావాడ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కొండములగాం సీహెచ్‌సీకి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కిల్లారి రమణమ్మ(60), కిల్లారి సూరికృష్ణప్పడు (70) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఇప్పిలి శ్రీరాములు, బొంత కాంతమ్మ గాయలతో బయటపడ్డారు. కిల్లారి రమణమ్మకు భర్త సత్యం, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కిల్లారి సూరికృష్ణప్పడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఊహించని విధంగా కందిరీగలు దాడిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపర్లకు కంటతడి తెప్పించింది. శనివారం లంకపేటలో అంత్యక్రియలు పూర్తిచేశారు.





సూరికృష్ణప్పడు, రమణమ్మ(ఫైల్)





ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షోలు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్ధరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాదారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసి వుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.



ప్రజలకు సంక్షేమాన్ని వివరించడమే లక్ష్యం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మహాలక్ష్మి నగర్ కాలనీలో వంద రోజుల పాలన కరపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడమే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ 24వ డివిజన్ మహాలక్ష్మి నగర్ కాలనీలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావుతో కలిసి శనివారం ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా.సుధీర్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాష్ట్రంలో సంక్షోభం: శంకర్

శ్రీకాకుళం రూరల్: ఐదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రం సంక్షోభంలో మునిగిపోయిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. లంకాంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీశ హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎంజీఆర్

దబ్బపాడు(ఎల్.ఎన్.పేట): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. దబ్బపాడులో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి అయిన తరువాత ఒక్కొక్కటి అమలు చేస్తున్నారన్నారు. టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు, తహసీల్దార్ వైవీపద్మా వతి, టీడీపీ నేతలు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, కె.కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు (సారవకోట): గోవర్ధనపురంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



శ్రీకాకుళం రూరల్: లంకాంలో కరపత్రాలిచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

సమాంతరంగా సంక్షేమం-అభివృద్ధి: శిరీష

హరిపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లోనే సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా అమలు చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన బుడార్సింగి, పాతకోట, గుడ్డ్యాల గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి బీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్ని కష్టాలు ఎదురైనా సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడంతో పాటు మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలను కూటమి ప్రభు త్వం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకుందన్నారు. మండలంలోని సమస్యలను దశల వారీగా పరిష్కరి స్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం: బగ్గు

జలుమూరు (సారవకోట): పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గోవర్ధనపురంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లలో పాలన ఇరవై ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో గణనీయమైన మార్పులు సాధించి రాష్ట్రాభివృద్ధి పురోగతి వైపు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, నేతలు కత్తిరి వెంకటరమణ, ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, పట్ట ఉమారావు, డి.జయరాం, జనసేన నాయకులు బలగ ప్రవీణ్‌కుమార్, పి.నందకిశోర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: కలమట

కొత్తూరు: మాతల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనను వివరించారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



హరిపురం: బుడార్సింగిలో స్టిక్కర్ అంటిస్తున్నఎమ్మెల్యే శిరీష

లడ్డూ కలుషితం పాపం జగన్‌దే: రవికుమార్

పొందూరు: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కలుషితం చేసి అపవిత్రం చేసిన పాపం మాజీ సీఎం జగన్‌దేనని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆరోపించారు. లోలుగులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శని వారం నిర్వహించారు. శుద్ధమైన నెయ్యితో చేయాల్సిన ప్రసాదాన్ని కేవలం కమీషన్ల కక్కుర్తితో నాణ్యతలేని నెయ్యిని వాడారన్నారు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం, పీఎంలను కోరతానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో హరిహరరావు, టీడీపీ నేతలు సీహెచ్ రామ్మోహన్, కూన సత్యారావు, ఎ.రాము, బి.శంకర భాస్కర్, జనసేన, బీజేపీ నేతలు పేడాడ రామ్మోహన్, ఎల్.సింహాచలం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విజయం: ఎన్ఈఆర్

లావేరు: కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విజయవంతమైందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. అదపాకలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. వందరోజుల్లో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకుడు ముప్పిడి సురేష్, జనసేన నాయకులు విశ్వక్సేన్, మాజీ ఎంపీపీ మీసాల వెంకటరమణ, తోటయ్యదొర, కిల్లారి నాగేశ్వరరావు, నడిమింటి చార్లెస్, లంకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసింది: అశోక్

కవిటి: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ ఆరోపించారు. రాజపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, నాయకులు ఎస్‌పీ రమణ, పి.కృష్ణారావు, బి.రమేష్, వి.రంగారావు, బి.సురేష్, బి.తిరుమల, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎన్‌పేట: దబ్బపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



పొందూరు: లోలుగులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



లావేరు: అదపాకలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



కవిటి: రాజపురంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్



కొత్తూరు: మాతలలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న కలమట రమణ

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి

పలాసరూరల్: పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. నీలావతి గ్రామంలో పశుసంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం, దూడల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జేడీ ఆర్.మురళీధర్, డీడీ వి.జయరాజ్, టీడీపీ నాయకులు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, కిక్కర ఢిల్లీరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఏడీ పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** విద్యార్థి దశ నుంచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గోవిందపురం హైస్కూల్ ఆవరణలో శనివారం నియోజకవర్గస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిబాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ● **హరిపురం:** ఆడపిల్లలకు తొలిగురువు అమ్మేనని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. జీఆర్‌పురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శ్రీకాకుళంకు చెందిన వన్‌స్టాప్ సెంటర్ ఏఎస్ఐ రేణుక, ఎస్‌వో వాసంతి ఆధ్వర్యంలో శనివారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రామ లక్ష్మి, మంగమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

'రెడ్‌బుక్ పేరిట వైసీపీ నేతలపై దాడులు'

టెక్కలి: రెడ్‌బుక్ పేరిట వైసీపీ నేతలు, కార్యకర్తలు, వ్యాపారులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రౌడీషీటర్లు, కిల్లర్లకు ఆశ్రయం కల్పిస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాల చుట్టూ, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పోర్టు చుట్టూ తిరుగుతున్నారు తప్ప నియోజకవర్గ అభివృద్ధి పై దృష్టిలేదన్నారు. వ్యవసాయ మంత్రి సొంత నియోజకవర్గంలో యూరియా బస్తా రూ.500లకు అమ్మకాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

'లడ్డూ ప్రసాదంపై రాజకీయం తగదు'

మందస: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేయడం సరికాదని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నా రు. శనివారం మందస వాసుదేవుని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉందంటూ దాని పవిత్రకు భంగం వాటిల్లేలా సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థులు

కోడూరు(పోలాకి): శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల, పెద్దపాడు అకాడమీ మైదానంలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ, కొన్నా చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీల్లో కోడూరు జట్టు విజేతగా నిలిచి త్వరలో విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని కోడూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆరవల్లి వెంకట శ్రీనివాసరావు, పీడీ ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర పోటీలకు ఎంపికైన టి.రమ్య, డి.ఉమామహేశ్వరరావు, పి.దిలీప్‌కుమార్‌లను అభినం దించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

లడ్డూ ప్రసాదం అపచారంతో దీపారాధన

నరసన్నపేట: తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో అపచారం జరగడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు దీపారాధన చేశారు. గోవిందనామాలను జపించారు. అర్చకుడు చామర్తి కృష్ణమాచార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చేతివృత్తి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండ

నరసన్నపేట/జలుమూరు: చేతివృత్తుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బండివీధి, తెలగవీధి, సారవకోటలో విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, తాళాభక్తుల గోవిందరావు, సాసుపల్లి కృష్ణబాబు, కింజరాపు రామారావు, స్వర్ణకారులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పోషణ వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఐసీడీఎస్ పీవో హెచ్.కామాక్షి, జనసేన నాయకులు బలగ ప్రవీణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, టీడీపీ బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, ఎంపీపీ కూర్మినాయుడు పాల్గొన్నారు.

చీపురుపల్లి నుంచి నేపాల్‌కు సైకిల్ యాత్ర

నరసన్నపేట: కాలుష్యం పెరిగి అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని, వీటిపై యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకు చీపురుపల్లి నుంచి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు విజయనగరం జిల్లా గరివిడి మండలం కె.పాలవలసకు చెందిన కె.హరికృష్ణ అన్నారు. యాత్రలో భాగంగా శనివారం జమ్ము జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెట్లను నరికివేయడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిందని, చెట్ల పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వా మ్యం కావాలని, ఇందులో భాగంగానే ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సుమారు నాలుగు నెలల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు.



సైకిల్ యాత్రికుడు హరికృష్ణ

పారిశుధ్యలోపంపై ఫిర్యాదు

హిరమండలం: అవలంగి గ్రామంలో పారిశుధ్యలోపంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు ఎంపీడీవో శైలజకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామాన్ని ఆయన పరిశీలించగా స్థానికులు పూడికలు తీయిం చాలని కోరారు. దీంతో తక్షణం తగు చర్యలు తీసుకుని పారి శుధ్య పనులు చేయించాలని ఆయన కోరారు.

తులసీదాస్ ఆశయాలను కొనసాగించాలి

మందస: దివంగత రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మజ్జి తులసీదాస్ ఆశయాలను కొనసాగించాలని ఆయన కుమారుడు మజ్జి త్రినాథబాబు అన్నారు. మందసలో శనివారం తులసీ దాస్ 30వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి తులసీదాస్, మజ్జి శారద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో కొర్ల హేమారావు చౌదరి, కొర్ల విశ్వనాథం, కొర్ల నాగేశ్వరరావు, రాజారావు, మజ్జి బాబూరావు, గాంగేయులు, పైడి పట్టాభి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

వజ్రపుకొత్తూరు: మండలంలో కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదని టీడీపీ నాయకులు వైసీపీ నేతలకు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం పూండిలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో నేతలు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిపై దృష్టి సారించక అవినీతి, అక్రమాలకు నేతలు పాల్పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులకు ఏక గ్రీవంగా తీర్మానాలు చేసినా ఇప్పటి వరకు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్ మండల పరిషత్ తీర్మానాలు ఇవ్వక పోవడాన్ని తీవ్రంగా ఖం డిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పుచ్చ ఈశ్వరరావు, గొరకల వసంత రావు, కర్ని రమణ, అర్జవెల్లి ఉమామహేశ్వర రావు, గోవిందు పాపారావు, చింత నారాయణ, కోనారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గదర్శకంగా నిలవాలి

పాతపట్నం: విద్యార్థులు నవ సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని ఐసీడీఎస్ పీవో టి.విమలా రాణి అన్నారు. 'నశాముక్త భారత్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, మహిళా వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానవహారం చేపట్టారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి: అన్ని ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ కార్యాలయంలోనైనా ప్రజా సమస్యలపై స్పందించి కష్టపడి పని చేసేవారే తనకు కావాలన్నారు. బదిలీల కోసం పైరవీలు చేసే వారు కష్టపడి పని చేసేందుకు శ్రద్ధ చూపాలని కోరారు.

భూముల రీ సర్వేపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

కొత్తూరు: గత ప్రభుత్వంలో భూముల రీ సర్వేలో అక్రమాలు జరిగాయని, సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం భూ హక్కులు కలిగిన రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌తో పాటు గేదెల కృష్ణారావు, పెదకోట యతిరాజు మాట్లాడుతూ.. సర్వ హక్కులున్నా మా భూమిలో వేరొకరికి ఈ పంట నమోదు చేయడం తగదన్నా రు. సర్వేల్లో తప్పుడు తడకలున్నాయన్నారు. దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్లెమ్మ పంచాయతీ మాజీ సర్పంచ్ మురపాక శంకరరావు, పెదకోట శివ, మహేష్, రామరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

హరిపురం: మఖరజోల వద్ద సారా తరలిస్తున్న సవర దుర్యోధన రావును పట్టుకున్నట్లు ఎస్ఐ ఖాదర్‌భాషా తెలిపారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై 40 లీటర్ల సారాను తరలిస్తున్న కొండలోగాం గ్రామానికి చెందిన దుర్యోధన పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి సోంపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

త్వరలో వినియోగంలోకి హుద్‌హుద్ గృహాలు

సంతబొమ్మాళి/కలెక్టరేట్: జిల్లాలో హుద్‌హుద్ గృహాలను త్వరలోనే వినియోగంలోకి తీసుకు వస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు అన్నారు. శనివారం సంతబొమ్మాళి, రాగోలు, గాజుల కొల్లివలస, కోటబొమ్మాళిల్లో హుద్‌హుద్ గృహాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ బి.నగేష్, ఎస్ఈలు శ్రీరామాచారి, నాగభూషణం, ఈఈ నర్సింగరావు, సత్యాజీ, ఏఈలు సన్యాసిరావు, నర్సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోండి

టెక్కలి: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ అన్నారు. శనివారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ... వైద్య కళాశాలల్లో పీపీపీ విధానం ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే మెడికల్ కళాశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఆయనతోపాటు మహేష్, ధర్మారావు ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

హరిపురం: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాధవరావు అన్నారు. మార్పు ట్రస్టు భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. సంఘ నేతలు మామిడి భీమారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

జలుమూరు: ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా 33/11 కేవీ బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకరు ఏర్పాటు చేస్తున్నందున సోమవారం తిమడాం ఫీడర్‌పై ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు అచ్యుతాపురం, తిమడాం, పర్లాం, శ్రీముఖలింగం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ● **జలుమూరు (సారవకోట):** బుడితి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నందున బుడితి ఫీడర్‌పై ఉన్న గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బుడితి, అవలింగి, చీడిపూడి, బద్రి, గుమ్మపాడు, అక్కివలస, బైదలాపురం, కిన్నెరవాడ తొగిరి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED శ్రీకాకుళం బ్రాంచి శ్రీకాకుళం-1వారు ఇచ్చిన లీగల్స్ ప్రకారము యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని శ్రీశ్రీమతి గొర్లె నాగరాజుకుం గొర్లె జనార్ధనరావు వీరి ప్రాపర్టిని షూరిటీగా వీరికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్థిపై ఎవరికైనను ఏటువంటి అప్పులు, చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంటు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేటి నుండి ఏడు దినములలో ఈక్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, రణస్థలం సబ్.డి., లావేరు మండలం, గోవిందపురం పంచాయితీ, భరిణికాం రెవెన్యూ గ్రామం లెక్కదాఖలా జి.మెట్టు ఖాళీస్థలం వివరం. 1వ ఖాతా నెం. 961, ఎల్.పి.నెం.2205, సర్వే నెం. 57-3తు హద్దులు: **తూర్పు:** ఆంజనేయస్వామి గుడి, **పడమర:** పతివాద గంగునాయుడు ఖాళీస్థలం, **ఉత్తర:** తారు రోడ్డు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

పబ్లిక్ నోటీసు

[illegible]

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

పబ్లిక్ నోటీసు

[illegible]

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

పబ్లిక్ నోటీసు

[illegible]

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

బహిరంగ ప్రకటన

[illegible]

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

పబ్లిక్ నోటీసు

[illegible]

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

LAND FOR SALE

★ రణస్థలం జంక్షన్ రామతీర్థాలు వెళ్ళే రోడ్డుకి 2వ బిట్టు 33 సెంట్లు (హాస్పిటల్ జంక్షన్ 2 రోడ్ కార్నర్) E/N ఫేసింగ్ 30 ft. రోడ్ & సరౌండింగ్3 కాలేజీలు. సంప్ర: 8309494629, 9885180930 AJV_204559

అద్దెకు కలదు

శ్రీకాకుళం నవభారత్‌నగర్ కాలనీ 2వ లైన్‌లో 2BHK ఇల్లు అద్దెకు కలదు. హైవే నుండి 50మీటర్లు మాత్రమే పూర్తిగా ఫర్నిష్డ్ హౌస్. సంప్రదించగలరు. 9963207160. AJS

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/పేషంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18కె సం: 9160900024/9640400073 AJH-15223

ఆంధ్రజ్యోతి

అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029,పలాస: 9985411524
సోంపేట: 9989281099,రాజాం : 9573179776





తీరం పరిరక్షణకు కృషిచేయాలి

● బీచ్‌ల్లో 'స్వచ్ఛసాగర్ - సురక్షిత సాగర్'

కాలుష్యం కోరల నుంచి సముద్రతీర పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని గార మండలం బందరు వానిపేట, సోంపేట మండలం ఇస్కలపాలేం, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో స్వచ్ఛ సాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్‌ల్లో చెత్త తొలగించారు. కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గార: బందరువానిపేట బీచ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు



ఎచ్చెర్ల: బుడగట్లపాలెంలో స్వచ్ఛ సాగర్- సురక్షితసాగర్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్



సోంపేట: ఇస్కలపాలేం బీచ్ పరిసరాల్లో తుప్పలను తొలగిస్తున్న యువకులు

ABN ఆంధ్రజ్యోతి

ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

ఉద్యోగం పేరుతో మహిళకు మోసం

● నకిలీ ఆర్డర్ కాపీతో రూ.నాలుగు లక్షలు కాంట్రాక్ట్ ఉద్యోగి టోకరా

శ్రీకాకుళం క్రైమ్/ అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి, అదే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి ఓ మహిళను లోబరుచుకుని, ఆమె నుంచి రూ.నాలుగు లక్షలు వసూలు చేసి, నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చాడు. చివరకు ఆమె ఆత్మహత్యకు యత్నించడంతో ఈవ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలు, కుటుంబ సభ్యుల కథనం మేరకు..జిల్లా వైద్యారోగ్యశాఖలో 2018లో కాంట్రాక్టు ప్రాతిపదికన చేరి, ప్రస్తుతం ఓ పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర కిందట పరిచయమైన శ్రీకాకుళానికి చెందిన ఓ మహిళకు వైద్యారోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. తన పెద్దకూతురివంటూనే ఆమె నుంచి ఉద్యోగం కోసం దశల వారీగా రూ.నాలుగు లక్షలు వసూలు చేశాడు. ఇటీవల ఆ మహిళకు నకిలీ ఆర్డర్ కాపీని అందించాడు. ఆమె ఉద్యోగం వచ్చిందన్న ఆనందంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులను సంప్రదించింది. ఆ ఆర్డర్ కాపీ వైద్యారోగ్యశాఖ అధికారికంగా జారీ చేసినది కాదని, అది నకిలీదని ఆ మహిళకు వారు చెప్పడంతో విస్తుపోయింది. రూ.నాలుగు లక్షలు తీసుకుని తనకు ఉద్యోగం ఇచ్చినట్లు ఈ కాపీ ఇచ్చారని ఆమె అధికారుల వద్ద వాపోయింది. ఆర్డర్ కాపీ ఇచ్చిన వారిని పిలిపించాలని అధికారులు సూచించడంతో ఆ మహిళ తనను మోసం చేసిన వ్యక్తిని నిలదీసింది. దీంతో వీరి మధ్య వివాదం చోటుచేసుకుంది. తన భర్తకు తెలియకుండా రూ.నాలుగు లక్షలు ఉద్యోగంకోసం ఇవ్వడంతో పాటు, ఆ ఉద్యోగి చేతిలో మోసపోయాయని మనస్తాపంతో బాధితురాలు ఈనెల 18న ఆత్మహత్యకు యత్నించింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న బాధితురాలిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరింది. అయితే గత ఏడాదిన్నరగా ఉద్యోగం కోసం విజయవాడ, విశాఖపట్నం వెళ్లాలని చెబుతూనే ఆ మహిళను భర్తకు తెలియకుండానే, ఆ ఉద్యోగి బయటకు తీసుకువెళ్లి లోబరుచుకున్నట్లు బాధితురాలు ఆరోపించింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రోజునే ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులు బాధితురాలి ఇంట్లోకి చొరబడి దౌర్జన్యం చేయడంతోపాటు ఆమెకు ఇచ్చిన నకిలీ ఆర్డర్ కాపీలు, నగదు లావా దేవీలకు సంబంధించిన పత్రాలను తీసుకుని వెళ్లిపోయినట్లు బాధితురాలి భర్త పోలీసులకు తెలిపాడు.

చర్యలు తీసుకుంటాం

ఉద్యోగం పేరుతో నకిలీ ఆర్డర్ కాపీ అందజేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. ఉద్యోగం పేరుతో మోసం చేసాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్టు ఉద్యోగి పై గతంలో కూడా ఓ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలుస్తోంది. శనివారం జిల్లాలో డీఐజీ నేర సమీక్ష సమావేశం నిర్వహించడంతో, ఆదివారం కేసు నమోదు చేస్తామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

టెక్కలిలో యువకుడి మృతి

టెక్కలి/సరుబుజ్జిలి: టెక్కలి పాత జాతీయ రహదారి నవీన్‌నగర్ సమీపంలో ఓ యువకుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి శనివారం రాత్రి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి జేబులోఉన్న ఆధార్‌కార్డు మేరకు సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురానికి చెందిన ఆర్.మల్లేశ్వరరావు(40)గా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై ఆరాతీస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కొత్తూరు: పారాపురం గ్రామానికి చెందిన వివాహిత సుబుద్ధి బాలామణి (30) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని పోలీసులు తెలిపారు. ఒడిశా గుమడ రామన్నగూడకు చెందిన బాలామణికి కొత్తూరు మండలం పారాపురం గ్రామానికి చెందిన తేజేశ్వర రావుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. ఈనెల 18న విష పదార్థం సేవించగా శ్రీకాకుళం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్రీకాకుళం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబం సభ్యులకు అందించారు. కుమార్తె మృతిపై తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ తెలిపారు.

రైలు కింద పడి ఒడిశా వాసి ..

నరసన్నపేట: మండల పరిధి కొల్లవానిపేట వద్ద రైల్వేట్రాక్ పక్కను ఒడిశాకు చెందిన 54 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి హౌరా వెళుతున్న ఈస్ట్‌కోస్టు రైలు నుంచి శుక్రవారం రాత్రి 12.45 సమయంలో ఒడిశాకు చెందిన గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడు. శనివారం విధుల నిర్వహణకు వచ్చిన గ్యాంగ్‌మెన్లు మృతదేహం ఉన్నట్లు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని రైల్వే ఎస్ఐ మదుసూదనరావు చెప్పారు.

డీలర్లకు నష్టం లేకుండా చర్య తీసుకోవాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

కలెక్టరేట్: రేషన్ డీలర్లకు నష్టం లేకుండా, కార్డుదారులకు ఇబ్బంది కలగకుండా, రూరల్ ఏరియాలో 600 కార్డులు, అర్బన్ ఏరియాలో 800 కార్డులకు తక్కువ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సంఘ జిల్లా యూనియన్ నాయకులు కోరారు. కనీస వేతనం రూరల్ ఏరియాలో రూ.18,500, పట్టణ ప్రాంతాల్లో రూ.24,500లు ఆదా యం వచ్చేలా ఏర్పాటుచేయాలని తెలిపారు.ఈ మేరకు శనివారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్డులు విభజించే ముందు అధికారులు యూనియన్‌ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామారావు, ఎన్.రవికుమార్, పి.కోటేశ్వరరావు, కె.చిట్టియ్య, కె.నాగరాజు, పి.రాజు పాల్గొన్నారు.

వాహన్ వెబ్‌సైట్‌లో అన్నిరకాల సేవలు: డీటీసీ

ఇచ్ఛాపురం: వాహన వినియోగదారులు ఇక నుంచి వాహన్ వెబ్‌సైట్‌లో అన్నిరకాల సేవలు పొందవచ్చని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.శనివారం ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద కామన్ సర్వీస్ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన వాహన యజమానులు, రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వెళే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్మిట్లు, వాహనాల పన్ను చెల్లించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు నిరంజన్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్



హైకోర్టు జడ్జితో మాట్లాడుతున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/కలెక్టరేట్: శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి, రిసోర్స్‌పర్సన్లగా వచ్చిన విశ్రాంత జిల్లా న్యాయాధికారులు ఎం.రామకృష్ణారావు, యు.సత్యారావును శనివారం కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఎస్.సుబ్బారెడ్డిని కలిశారు.

● **గార:** శ్రీకూర్మంనాథుని హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని ఈవో గురునాదరావు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు అందజేశారు.

ఆశావహ దృక్పథంతో సంతోషకర జీవనం



మాట్లాడుతున్న ఎంవీఆర్ రాజు

ఎచ్చెర్ల: ఆశావహ దృక్పథంతోనే సంతోషకరమైన జీవనం సాధ్యమని ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ సైకాలజీ కౌన్సిలర్ ఆచార్య ఎంవీఆర్ రాజు తెలిపారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సైకాలజిక్ అసెస్మెంట్ అండ్ కౌన్సెలింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని,వర్సిటీ రెక్టర్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, సెంటర్ ఫర్ సైకలాజికల్ అసైస్మెంట్ అండ్ కౌన్సెలింగ్ డైరెక్టర్ డాక్టర్ జేఎల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం కల్తీ చేయడం దారుణం

జి.సిగడాం: తిరుపతి శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం డిమాండ్ చేశారు. శనివారం జి.సిగడాంలో విలేకరులతో మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల విశ్వాసంతో ముడిపడి ఉన్న తిరుపతి లడ్డూ పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం అత్యంత దారుణమన్నారు. తిరుమల పవిత్రను పూర్తిగా మంటగలిపారని ఆరోపించారు.

యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థినులు



యోగాలో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తున్న బాలాజీ

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్(ట్రిపుల్) విద్యార్థినులు కె.హేమరితిక, కె.మేఘన జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. భీమిలిలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన అండర్-18 యోగా రాష్ట్రస్థాయి పోటీల్లో కె.హేమరితిక నాలుగు, కె.మేఘన ఐదో స్థానాన్ని సాధించారు. ఈమేరకు వీరిని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణచౌదరి, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు అభినందించారు.

గ్రిగ్స్ పోటీలకు పొందూరు విద్యార్థులు

పొందూరు: పొందూరు ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20న ఆమదాలవలస మండలంలోని తొగరాం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచారు. అండర్-17 విభాగంలో వాలీబాల్‌లో కుమార్‌సాయి, పి.తరుణ్, కబడ్డీలో ఆర్.రాజు, బ్యాడ్మింటన్‌లో డి. రాజు, దినేష్, లాంగ్‌జంప్‌లో డి. రాజేష్, 100 మీటర్ల పరుగులో దిలీప్, చాందిని, యోగాలో గుణశేకర్, అండర్-14 విభాగంలో బడ్డీలో షేక్ సల్మా, వాలీబాల్‌లో పృధ్వీరాజ్, బీడ్మింటన్‌లో భరత్, కె. గోవింద ఎంపికైనట్లు పీడీలు ఉదయ్, ఎస్‌వి రమణ, రజని ఎంపికయ్యారని తెలిపారు.

ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలి



మాట్లాడుతున్న అప్పలనాయుడు

సరుబుజ్జిలి: విద్యారులు నైతిక విద్య నేర్చుకొని ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలని జిల్లా యువజన సర్వీసులశాఖ సెట్‌శ్రీ జిల్లా మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. శనివారం రొట్టవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సెట్ శ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్కార్డ్ ఈసేవా సంస్థ అధ్యక్షుడు బొంగు సత్యనారాయణ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై దిశా నిర్దేశంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు

సరుబుజ్జిలి: వచ్చే నెలలో ప్రభుత్వం చేపట్టే గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సరుబుజ్జిలి మండల శాఖ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం సమన్వయకర్తలు దవళ సింహాచలం, తులగాపు ధనుంజయరావు మండల పరిషత్ పరిపాలనాధికారి జీవీ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం అజెండా ప్రాప్తికి సభలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు అప్పలరాజు, జనపాల సతీష్, చిరంజీవి పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ తప్పనిసరి



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

పొందూరు: పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల కొరత వల్ల వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులు తప్పనిసరి అని కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె. భాగ్యలక్ష్మి, లైదాం సర్పంచ్ జి.అనంత రామకృష్ణ తెలిపారు. లైదాంలో రెడ్డీస్ ఫౌండేషన్, కృషి విజ్ఞానకేంద్రం సంయుక్తంగా రైతులకు వరిసాగు - ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పెట్టుబడి కోసం రుణాలు ఇప్పించాలి

ఆమదాలవలస: శ్రీనిధి ద్వారా మహిళలకు అవసరమైన పెట్టుబడి కోసం రుణాలను ఇప్పించాలని వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం కలివరంలో క్లస్టర్ స్థాయి సమావేశంలో మాట్లాడుతూ మంచి ప్రభుత్వం కార్య క్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమన్వయ కర్త రామప్పడు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీపై విచారణ చేయాలి

పొందూరు: తోలాపి పంచాయతీలో జగనన్న కాలనీలో భూసేకరణ, ఇళ్ల పట్టాల పంపిణీలో జరిగిన అవినీతిపై అధికారులు విచారణచేయాలని తోలాపి ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొన్నాడ అప్పారావు డిమాండ్ చేశారు. తోలాపిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీనాయకులు ఇళ్లఉన్నవారికి, పట్టాచ్చారని విమర్శించారు. కొంతమంది నాయకులకు లబ్ధి చేకూర్చేందుకు వైసీపీ కార్యకర్తల నుంచి చెరువుగర్భంలో భూమి కొనుగోలు చేశారని ఆరోపించారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి పరిసర ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. సరుబుజ్జిలిలోని నాలుగు కూడళ్లు జలమయమయ్యాయి. నందికొండలోని వీధుల్లో కాలువలను తలపించేలా నీరు ప్రవహించింది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలోగల గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. శ్రీకాకుళం నుంచి హిరమండలం వైపు వెళ్తున్న ఓ ఆటో స్థానిక పెట్రోల్‌బంకు వద్ద ఏబీ రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి బోల్తాపడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఈదుపురంలో పోషకాహార మాసోత్సవాలు



ఈదుపురంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ అధికారులు పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలను ప్రదర్శించి వాటి ఆవశ్యకతను వివరించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, నర్తు డిల్లీరావు, జుత్తు గణేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, సుందరి, జ్యోతి, విమల, పార్వతి పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



స్తంభం, గోడలకు పెచ్చులూడుతున్న దృశ్యం

గార: మండలంలోని ఆడవరంలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో పాఠశాలకు చెందిన క్షగదిలో నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా దశాబ్దాలు కిందట నిర్మించినది కావడంతో గోడలు బీటలు వారి స్తంభాలు తుప్పు పట్టిపోయి, శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. దీంతో కేంద్రంలో చిన్నారులు, సిబ్బంది బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు.

25న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కలెక్టరేట్: జడ్పీస్థాయి సంఘ సమావేశాలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు సీఈవో వెంకటరామన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం పది గంటల నుంచి 2,4,1,7, మధ్యాహ్నం మూడు గంటల నుంచి 6,3,5 సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 28వ తేదీ వరకు గడువు పెంచుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధి కారి తిరుమల చైతన్య తెలిపారు. అపరాధ రుసుం 200 రూపాయలతో ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తును ఆన్‌లైన్ చేయించుకున్న తర్వాత వచ్చిన రిఫరెన్స్ నెంబర్ ఆధారంగా ప్రవేశ ఫీజును అభ్యర్థులు స్వయంగా వెళ్లి ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు సమీపంలోగల స్టడీ సెంటర్ల వద్దకు వెళ్లి కోఆర్డినేటర్‌ను సంప్రదించి లాగిన్ ఐడీ ద్వారా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించుకోవాలని కోరారు.

రక్తదానానికి ముందుకురావాలి: కలెక్టర్

కలెక్టరేట్: యువత పెద్ద ఎత్తున రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. శనివారం శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 70వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.అనంతరం ఈఈ ఆఫీసు ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. రక్తదాతలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

225 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: కొలిగాం జడ్పీ ఉన్నతపాఠశాల శనివారం శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 225 మందికి పరీక్షలు నిర్వహించి, 20 మందిని ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ఏరియా మేనేజర్ లోకేష్ తెలిపారు. కార్య క్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు జ్యోతి, పద్మావతి, చంద్రవదన, దేవకి, వాణి, పాల్గొన్నారు.

పెంటలో దంత వైద్యశిబిరం

జి.సిగడాం: పెంట ప్రాథమికోన్నత పాఠశాలలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మందికి వైద్యాధికారి బంకి లావణ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీవీ రమణ మూర్తి, హెచ్‌ఎం మజ్జి మదన్‌మోహన్, ఉపాధ్యాయులు, పి.అక్కలనాయుడు, శ్రీనివాసరావు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

గణనాథుని లడ్డూ వేలం

పొందూరు: పొందూరు కస్పావీధికి చెందిన వినాయకమండపంలో లడ్డూప్రసాదం వేలంపాటలో మహరాజా మార్కెట్‌కు చెందిన వ్యాపారి ముప్పిడి సంతోష్ రూ.41,600కు దక్కించుకున్నాడు.కమిటీ సభ్యులకు సంబంధించిన లడ్డూను మెమొంటో కళాకారుడు అరసవిల్లి వెంకటరావు రూ.14 వేలకు దక్కించుకున్నాడు.

'సూపర్‌సిక్స్'తో ప్రజలకు మోసం

ఆమదాలవలస: సూపర్‌సిక్స్ పథకాలతో నట్టేట ముంచి ప్రజలను మోసం చేశారని వైసీపీ ప్రచార విభాగం జోనల్ కార్యదర్శి చింతాడ రవికుమార్, ఆ పార్టీ యువనేత తమ్మినేని చిరంజీవినాగ్ ఆరోపించారు. శనివారం ఆమదాలవలస వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన నయవంచనతో సాగుతోందన్నారు. నూతన మద్యం పాలసీ పేద కుటుంబాల పాలిట గుదిబండగా మారిందన్నారు. నిరుద్యోగ భృతి కల్పించడంలో మోసగించారన్నారు. ప్రజలు ఇప్పటికైనా ప్రభుత్వం దుష్ట ఆలోచనలను అర్థం చేసుకోవాలన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రణస్థలం: బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. శనివారం లంకపేట హైస్కూల్‌లో బాలికల క్రీడా పోటీలను ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బంటుపల్లికి మంజూరైన బీసీ వసతిగృహాన్ని లంకపేటలో ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక ప్రభాకరరావు, శ్యామలరావు జగన్నాదం నాయుడు, అప్పలనాయుడు, పిన్నింటి భానుజినాయుడు, కృష్ణ, ముక్కు ఆదినారాయణ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరం ఆవరణలో గురజాడ విగ్రహం వద్ద పంచాక్షరి పుస్తకం ఆవిష్కరిస్తున్న వక్తలు



కవిటి: ప్రభుత్వోన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో...



సంతబొమ్మాళి: శాఖా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న పాఠకులు



టెక్కలి: శాఖా గ్రంథాలయంలో...

ఆధునిక సంస్కర్త గురజాడ

● జిల్లాలో ఘనంగా జయంతి వేడుకులు

మహాకవి గురజాడ వెంకటప్పారావు ఆధునిక సమాజ సంస్కర్త అని వక్తలు కొనియాడారు. శనివారం జిల్లాలో పలు చోట్ల మహాకవి గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆధునిక సమాజ గతిని తన రచనలతో నిర్దేశించారన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



నందిగాం: పెద్దతామరాపల్లి ఎంపీపీ పాఠశాలలో.